సాక్షి సంగారెడ్డి

గురువారం । 19 । అక్టోబర్ । 2023



మూడు ముక్కలాట!

దుబ్బాక నియోజకవర్గం మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో గ్రూపు విభేదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పాతతరం మారినా గ్రూపుల లొల్లి మారడంలేదు.

వివరాలు 10లో ▸



చిత్తా.. బొత్తా..?

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మొదటి నుంచి పొత్తుల సంసారం. ఇప్పటి వరకు పొత్తులు లేకుండా ఎన్నికలు జరగలేదు. కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ మధ్య పోటీ ఉండేది.

వివరాలు 10లో ▸



అన్నివర్గాలకు అండగా ఉంటా

రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించి మరోసారి సేవ చేసే అవకాశం కల్పిస్తే అన్నివర్గాలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

కార్మికుల ఐక్యతతో మరిన్ని విజయాలు

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

పటాన్‌చెరు: కార్మికుల ఐక్యతతో మరిన్ని చారిత్రక విజయాలు సాధిద్దామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు పిలుపునిచ్చారు. బుధవారం శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. మంగళవారం జరిగిన హెచ్‌ఎంఎస్ యూనియన్ గేట్ మీటింగ్‌లో సీఐటీయూ నాయకత్వంపై చేసిన ఆరోపణలను ఖండించారు. అసత్య ఆరోపణలతో శాండ్విక్ కార్మికుల ఐక్యతను దెబ్బతీయాలని చూస్తే తగిన గుణపాఠం చెబుతారన్నారు. గురువారం జరిగే ఎన్నికలలో సీఐటీయూ ×చుక్క గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. సమావేశానికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేష్, సీఐటీయూ జిల్లా నాయకులు, శాండ్విక్ యూనియన్ నాయకులు, వివిధ పరిశ్రమల యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రూ. 10.5 లక్షలు సీజ్



నగదును స్వాధీనం చేసుకుంటున్న ఎస్‌ఐ నరేశ్

జహీరాబాద్ టౌన్: సరైన పత్రాలు లేకుండా వేర్వేరు వాహనాల్లో తీసుకెళ్తున్న రూ.10.5 లక్షల నగదును సీజ్ చేసినట్లు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేశ్ తెలిపారు. మొగుడంపల్లి మండలం పడియాల్ తండా వద్ద బుధవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఓ వాహనంలో సరైన పత్రాలు లేకుండా రూ.7.5 లక్షలు, అలాగే మాడ్గి చెక్‌పోస్టులో మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వాహనంలో రూ. 3 లక్షల నగదు గుర్తించారు. సరైన పత్రాలు లేని కారణంగా ఆ నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం

బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్



బీఆర్‌ఎస్‌లో చేరిన ముస్లింలు

సదాశివపేట(సంగారెడ్డి): మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. బీఆర్‌ఎస్ మైనార్టీ పట్టణ అధ్యక్షుడు ఖుద్దూస్, 15వ వార్డు ఇన్‌చార్జి అయూబ్‌ఖురేషీ ఆధ్వర్యంలో పలువురు యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తానన్నారు. సీఎం కేసీఆర్ ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలు అమలుచేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చీలమల్లన్న, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంకార్‌పూర్ రైతులను ఆదర్శంగా తీసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు

జహీరాబాద్ టౌన్: అంకార్‌పూర్ రైతులను ఆదర్శంగా తీసుకుని పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు సూచించారు. పట్టణంలోని కేవీకే–డీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉద్యాన విద్యార్థుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అంకార్‌పూర్ రైతులు పంటలు పండించడంతో పాటు మార్కెటింగ్ కూడా చేస్తారని చెప్పారు. రైతులు పెట్టుబడిదారులుగా వ్యవహరిస్తే ఎక్కువ లాభాలు ఆర్జిస్తారన్నారు. శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న విషయాలు ఆచరణలో పెట్టాలన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ భిక్షపతి, కేవీకే శాస్త్రవేత్తలు నితీష్‌కుమార్, విజయలక్ష్మి, ఏఓలు ప్రవీణ, ఏఈఓలు ప్రదీప్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు



‘హస్త’వ్యస్తం..!

కాంగ్రెస్ నుంచి కొనసాగుతున్న వలసలు

- సంగారెడ్డి, జహీరాబాద్‌లలో క్రమంగా వీడుతున్న సెకండ్ కేడర్
- బీఆర్‌ఎస్‌లో చేరికలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : కాంగ్రెస్ పార్టీ నుంచి వలసలు కొనసాగుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ జారీకి సమయం దగ్గర పడుతున్న కొద్దీ కాంగ్రెస్ కేడర్ ఆ పార్టీ వీడుతున్నారు. నియోజకవర్గ స్థాయి నాయకులతో పాటు, ద్వితీయ శ్రేణి నాయకులు కూడా గుడ్‌బై చెబుతుండటం ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ప్రధానంగా జహీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఆ పార్టీ నుంచి వలసలు ఆగడం లేదు. నెల క్రితం నియోజకవర్గం ముఖ్య నాయకుడు ఏర్పుల నరోత్తం కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన విషయం విదితమే. తాజాగా ఇదే నియోజకవర్గంలోని కాంగ్రెస్‌కు చెందిన ఝరాసంఘం జెడ్పీటీసీ వినీలా ఆ పార్టీని వీడారు. మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు. వినీలాతో పాటు మరికొంత మంది అనుచరులు గులాబీ పార్టీలో చేరారు. అంతకు ముందు జైపాల్‌రెడ్డి కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. నియోజకవర్గంలో బలమైన ముఖ్యనేతల్లో ఒకరైన జైపాల్‌రెడ్డి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇలా వరుసగా కాంగ్రెస్ ముఖ్య నాయకత్వం ఆ పార్టీని వీడుతుండటం చర్చనీయాంశమైంది.

సంగారెడ్డి నియోజకవర్గంలోనూ..

సంగారెడ్డి నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ పార్టీ నాయకులు వలసబాట పట్టారు. ఇటీవల కొండాపూర్ మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీని వీడారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ సర్పంచ్‌లు మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఐదు నెలల క్రితం కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కూడా ఆ పార్టీని వీడి గులాబీ పార్టీలో చేరారు.

గాలం వేస్తున్న బీఆర్‌ఎస్

నోటిఫికేషన్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ బీఆర్‌ఎస్ ఆయా నియోజకవర్గాల్లో పట్టు బిగిస్తోంది. ఎలాగైనా ఈ ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో పట్టు నిలుపుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఒకవైపు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూనే మరోవైపు ప్రత్యర్థి పార్టీలను దెబ్బతీయడం ద్వారా ఎన్నికల్లో విజయం సాధించేందుకు పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్‌లోని ద్వితీయ శ్రేణి నేతలకు బీఆర్‌ఎస్ గాలం వేస్తోంది.

అసంతృప్తులకు గాలం

కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తులకు బీఆర్‌ఎస్ గాలం వేస్తోంది. అసంతృప్త నేతలతో మంత్రి హరీశ్‌రావు స్వయంగా మాట్లాడుతున్నారు. రాజకీయ భవిష్యత్‌పై భరోసా కల్పిస్తుండటంతో వారంతా గులాబీ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు.

ఝరాసంగం జెడ్పీటీసీ ఝలక్



మంత్రి హరీశ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన జెడ్పీటీసీ వినీలా

ఝరాసంగం(జహీరాబాద్): మంత్రి హరీశ్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఝరాసంగం జెడ్పీటీసీ వినీలా బీఆర్‌ఎస్‌లో చేరారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రి ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జహీరాబాద్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, టీఎస్‌ఐడీసీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్, ఝరాసంగం మండల అధ్యక్షుడు వెంకటేశం, పాల్గొన్నారు.

పార్టీతోనా.. స్వతంత్రంగానా..!



అనుచరులతో సమావేశమైన నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్ : నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి బుధవారం తన ముఖ్య అనుచరులతో రెండు చోట్ల సమావేశమయ్యారు. టికెట్ రాకపోతే ఇతర పార్టీలో చేరి పోటీలో ఉండాలని, లేదా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగాలని ముఖ్య అనుచరులు ఎమ్మెల్యేపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. నర్సాపూర్ బీఆర్‌ఎస్ టికెట్‌ను పార్టీ అధిష్టానం ఇంకా అధికారికంగా ప్రకటించకుండా సస్పెన్స్‌లో పెట్టడంతో ఎమ్మెల్యే తన అనుచరులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. నర్సాపూర్ బీఆర్‌ఎస్ టికెట్‌ను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ నిర్ణయించిన విషయాన్ని మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు గత నెల 30న మదన్‌రెడ్డిని ప్రగతిభవన్‌కు పిలిచి చెప్పిన విషయం తెలిసిందే. అలాగే, ఈ నెల16న సైతం సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని ప్రగతి భవన్‌కు పిలిపించుకొని ఇదే విషయాన్ని చెప్పారని, ఎన్నికల అనంతరం ఆయనకు సముచిత స్థానం కల్పిస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి. బుధవారం ఉదయం ఓ బీఆర్‌ఎస్ నాయకుడి గెస్ట్‌హౌస్‌లో హత్నూర, చిలిపిచెడ్, నర్సాపూర్ మండలాల్లోని ఎమ్మెల్యే అనుచరులు ఆయనతో సమావేశమయ్యారు. టికెట్‌రాని పక్షంలో పార్టీకి రాజీనామా చేసి ఇతర (కాంగ్రెస్) పార్టీలో చేరి లేదా స్వతంత్రంగానైనా బరిలో ఉండాలని పలువురు నాయకులు ఎమ్మెల్యేపై ఒత్తిడి చేసినట్లు తెలిసింది. సునీతారెడ్డిని ఓడించాలన్నారు. అలాగే, కౌడిపల్లి, శివ్వంపేట మండలాల్లోని పలువురు నాయకులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిశారని తెలిసింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... టికెట్ సునీతారెడ్డికే ఇవ్వాలని పార్టీ అధిష్టానం నిర్ణయించిందని, నామినేషన్లు దాఖలు చేసే చివరి నిమిషంలో సైతం అభ్యర్థుల మార్పు చేసే ఘటనలు చోటు చేసుకుంటాయని, అందుకే తన వంతు గట్టిగా ప్రయత్నిస్తున్నానని తెలిపారు. తనకు బీఫారం ఇవ్వని పక్షంలో ముఖ్య అనుచరులతో సమావేశం పెట్టి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయం తీసుకుంటానని పేర్కొన్నారు. బీఫారం ఇవ్వక ముందే పార్టీకి రాజీనామా చేస్తే చెడ్డపేరు వస్తుందని అన్నారు.

సీఆర్పీఎఫ్ మహిళల సాహస యాత్ర



యాత్రకు వీడ్కోలు చెబుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఐజీ అనిల్ మింజ్

పటాన్‌చెరు టౌన్: ‘నారీ శక్తి’ వ్యాప్తి లక్ష్యంతో ‘యశస్విని ఆల్ ఉమెన్ మోటార్ సైకిల్ ఎక్స్‌పెడిషన్–2023’ పేరిట సీఆర్‌పీఎఫ్ మహిళా అధికారులు యాత్రను నిర్వహిస్తున్నారని సీఆర్‌పీఎఫ్ డీఐజీ అనిల్ మింజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ర్యాలీకి బుధవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం విశ్వవిద్యాలయంలో సీఆర్‌పీఎఫ్ డీఐజీ అనిల్ మింగ్, కమాండెంట్ ఎర్నల్ మోచిబెశ, అసిస్టెంట్ కమాండెంట్ కిషోర్, జిల్లా సంక్షేమ అధికారి సంధ్యారాణితో కలిసి స్వాగతం పలికారు. ఏకకాలంలో శ్రీనగర్, షిల్లాంగ్, కన్యాకుమారి నుంచి అక్టోబర్ 5న మూడు బృందాలు యాత్రను ప్రారంభించారు. 75 బైక్‌లపై 15 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల గుండా దాదాపు 10 వేల కిలోమీటర్లు ప్రయాణించి గుజరాత్‌లోని ఏక్తా నగర్‌కు ఈనెలాఖరు నాటికి చేరుకోనున్నారు. యాత్రలో 60 మంది ఉండగా, వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందినవారు 25 మంది ఉన్నారు. బేటీ బచావో, బేటీ పడావో నారీ శక్తి సందేశాలను వ్యాప్తిచేసే లక్ష్యంతో యాత్ర చేపట్టినట్లు సభ్యులు తెలిపారు. డిప్యూటీ కమాండెంట్ సుమా మాట్లాడుతూ పక్షపాతం లేకుండా ఆకాంక్షలను సాధించడానికి, బాలికలందరికీ సమాన మద్దతు, అవకాశాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్నామన్నారు.

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి వాహనం తనిఖీ

రామాయంపేట, నిజాంపేట(మెదక్): ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి వెళ్తున్న మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి వాహనాన్ని బుధవారం నిజాంపేట వద్ద ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. తనిఖీ సిబ్బందికి ఎంపీ సహకరించారని పోలీసులు తెలిపారు.



ఎంపీ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు



మహాలక్ష్మీగా దుర్గా భవానీ



అన్నపూర్ణా దేవిగా రేణుక ఎల్లమ్మ

అభి షేకాలు.. కుంకుమార్చన

పటాన్‌చెరు టౌన్: పట్టణంలో దేవి శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని నవపాన్ సమీపంలోఉన్న శ్రీరేణుక ఎల్లమ్మ దేవస్థానంలో అమ్మవారిని బుధవారం అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. అదేవిధంగా మహంకాళి దేవాలయం, రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవార్లను మహాలక్ష్మిగా అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు భక్తులు అమ్మవార్లను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మహాలక్ష్మి దేవిగా..

సంగారెడ్డి టౌన్: మండలంలోని ఇస్మాయిల్ ఖాన్ పేట గ్రామంలోని సప్తప్రాకారయుత శ్రీ దుర్గా భవానీ ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు బుధవారం అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది.

బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు మేలు

- ఎమ్మెల్యే మాణిక్‌రావు



సత్వార్ గ్రామంలో అవ్వ ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: బీఆర్‌ఎస్ పాలనలో ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు దక్కాయని ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని తుంకుంట, బూచినెల్లి, సత్వార్, బుర్దిపాడ్ తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులు భారీ ర్యాలీలు నిర్వహించారు. ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోలేని విధంగా సంక్షేమ పథకాలు సీఎం కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో చూసి ప్రతిపక్షాలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు దేవిప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, సర్పంచ్‌లు రాజు, మాణిక్‌రెడ్డి, అబ్రహం, మాజీ సర్పంచ్‌లు అమిత్‌కుమార్, జెడ్పీటీసీలు వినీల నరేష్, స్వప్నభాస్కర్, ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, ప్రవంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోటీపడి అభివృద్ధి చేశాం

ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

రామాయంపేట(మెదక్): బీఆర్‌ఎస్ ప్రభుత్వం సహకరించనప్పటికీ దుబ్బాక నియోజవర్గ అభివృద్ధికి పోటీపడి పనులు చేశానని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. బుధవారం నార్సింగి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైందన్నారు. తాను అతి తక్కువ కాలంలో చేపట్టిన అభివృద్ధిని గమనించాలన్నారు. మరోసారి అవకాశమిస్తే నియోజవర్గ రూపురేఖలు మారుస్తానన్నారు. మండల కేంద్రంలో ఏ ఒక్కరికి దళితబంధు ఇవ్వలేదన్నారు. అభివృద్ధికి సహకరించకపోయినా అభివృద్ధికి నిరంతరం తపిస్తున్నానన్నారు. నార్సింగిలో ఆస్పత్రి విస్తరణకు కృషి చేశానన్నారు.

పోలింగ్ కేంద్రాలు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

- జిల్లాలో 389 సమస్యాత్మక గ్రామాలు గుర్తింపు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్



నారాయణఖేడ్: పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ శరత్

నారాయణఖేడ్: జిల్లాలో ఈసారి ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు పోలింగ్ కేంద్రాలను ఆయా భవనాల్లోని గ్రౌండ్ ఫ్లోర్లలోనే ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. ఎస్పీ రూపేష్‌తో కలిసి బుధవారం నారాయణఖేడ్‌లో పర్యటించారు. జూకల్ శివారులోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్‌రూం, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. గతంలో పోలింగ్ తక్కువగా నమోదైన కిషన్ నాయక్ తండాలోని 164 పోలింగ్ కేంద్రంలో చునావ్ పాఠశాల కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ప్రలోభాలకు లొంగకుండా ప్రతీ ఓటరూ నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటర్లకు పార్టీలు ఎలా ప్రలోభపెడతాయో, వారి ప్రలోభాలకు లొంగి ఓట్లు వేస్తే కలిగే కష్టనష్టాలను వివరిస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తండావాసులకు అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ ఖేడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను ఈఆర్వో కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే బెల్లాపూర్‌లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని, కర్ణాటక సరిహద్దులోని మోర్గి చెక్‌పోస్టును సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 389 సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అధికారులకు తగిన సూచనలు, సలహాలను ఇచ్చారు. వారివెంట ఆర్డీఓ వెంకటేష్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ దేవిదాస్, ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సరిహద్దుల్లో నిఘా పెట్టండి

న్యాల్‌కల్(జహీరాబాద్): సరిహద్దు ప్రాంతమైన కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి మద్యం, డబ్బులు రవాణాకాకుండా ఉండేందుకు నిఘా పెట్టాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని హుస్సెల్లి, మల్గి గ్రామాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు, ఆయా గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమంగా మద్యం, డబ్బు వచ్చే అవకాశాలు ఉంటాయని, వాటిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్పీ రూపేష, ఏఎస్పీ వెంకటేశ్వర్లు, జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం, తహసీల్దార్ రాజిరెడ్డి, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చెక్‌పోస్టులు తనిఖీ

జహీరాబాద్ టౌన్: కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో గల మాడ్గి చెక్‌పోస్టును కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేష్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు చెక్‌పోస్టు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. సరిహద్దు చెక్‌పోస్టు కావడంతో కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను తనఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం జహీరాబాదలోని స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు.

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండల పరిధిలోని తెలంగాణ, కర్ణాటక సరిహద్దులో ఉన్న మోర్గి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వారి వెంట అదనపు ఎస్పీ అశోక్, ఆర్డీఓ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

ఆటో డ్రైవర్‌కు 10 ఏళ్లు జైలు

2017లో మహిళపై లైంగిక దాడి కేసు

పటాన్‌చెరు టౌన్: ఆటోలో వెళ్తుండగా మహిళపై లైంగిక దాడికి పాల్పడిన ఆటోడ్రైవర్‌కు న్యాయస్థానం పదేళ్లు జైలుశిక్ష విధించింది. సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ బుధవారం విలేకరులకు వివరాలు తెలిపారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందని ఓ మహిళ 2017 అక్టోబర్, 17 రాత్రి పటాన్‌చెరు నుంచి ఆటోలో తన స్వగ్రామానికి వెళ్తుండగా స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ అశోక్ మార్గమధ్యంలో మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు అప్పట్లో పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి డీఎస్పీ సీతారాం, సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి విచారణ నిర్వహించి నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని సంగారెడ్డి కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి సునీత రవీంద్రరెడ్డి నిందితుడికి పది సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. నేరస్తులకు శిక్ష పడినప్పుడే ప్రజలలో పోలీసులపై నమ్మకం పెరుగుతుందని ఎస్పీ అన్నారు.

మరణించినా ఇద్దరికి చూపు



కార్నియాలను సేకరిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

హుస్నాబాద్: స్థానిక రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ గుండోజు శంకర్(81) మరణించినా ఇద్దరికి చూపునిచ్చారు. శంకర్ నేత్రాలు ఇద్దరు అంధులకు చూపునిస్తాయని తెలంగాణ నేత్ర, అవయవ దాతల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజమల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ కొమురయ్య అన్నారు. రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ గుండోజు శంకర్ బుధవారం ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు శంకర్ నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. దీంతో ఎల్వీ ప్రసాద్ వరంగల్ కంటి ఆస్పత్రి సిబ్బంది వచ్చి శంకర్ కార్నియాలను సేకరించారు. ఈ సందర్భంగా బూట్ల రాజమల్లయ్య, కొమురయ్య శంకర్ కుటుంబ సభ్యులను అభినందించారు. స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, సంఘ నాయకులు మల్లారెడ్డి, శంకర్‌రావు, రాజేందర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో పూడూరు మండలం మిర్జాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చాలా మంది పార్టీలో చేరుతున్నారని తెలిపారు. తెలంగాణ పథకాలు ఏ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు.

మూడు ముక్కలాట!

- దుబ్బాక కాంగ్రెస్‌లో ఆది నుంచి విభేదాలకు కేరాఫ్ అడ్రస్
- టికెట్ కోసం త్రిముఖపోటీ
- ఎవరికి వారు ప్రచారం ముమ్మరం



చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



శ్రావణ్‌కుమార్‌రెడ్డి



కత్తి కార్తీక

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గం మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో గ్రూపు విభేదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పాతతరం మారినా గ్రూపుల లొల్లి మారడంలేదు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ ఉన్నప్పటికీ గ్రూపు రాజకీయాల వల్ల ప్రతిసారి పరాభవం ఎదుర్కొంటుందని పలువురు నేతలు అంటున్నారు. మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి తనయుడు శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పన్యాల శ్రావణ్‌కుమార్ రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి కత్తి కార్తీక గ్రూపుల మధ్యన పచ్చి గడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో విభేదాలు చోటుచేసుకుంటున్నాయి.

అధిష్టానానికి తలనొప్పిగా..

ఈ నేపథ్యంలో దుబ్బాక టికెట్ కేటాయింపు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా తయారైంది. అయితే ప్రజల్లో ఏ నాయకుడికి ఆదరణ ఉందన్న దానిపై అధిష్టానం ఇప్పటికే సర్వే చేయించిందని, ఆ సర్వే ఆధారంగానే టికెట్ కేటాయించాలని నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. కానీ ఆ ముగ్గురు నేతలూ మాత్రం తమకే టికెట్ వస్తుందని తమ అనుచరులతో సమావేశాలు నిర్వహిస్తూ గ్రామాల్లో హడావుడి చేస్తున్నారు. 2020లో జరిగిన దుబ్బాక ఉప ఎన్నికల్లో చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ కేటాయించగా.. పోటీ మాత్రం బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు, బీఆర్‌ఎస్ సోలిపేట సుజాత మధ్యనే నడిచి చివరకు వెయ్యికి పైగా ఓట్లతో బీజేపీ గెలుపొందడం తెలిసిందే.

టికెట్ కోసం త్రిముఖ పోటీ

దుబ్బాక కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, కత్తి కార్తీకతో పాటు పీసీసీ సీనియర్ నాయకుడు మద్దుల సోమేశ్వర్‌రెడ్డి తనయుడు గాల్‌రెడ్డి దరఖాస్తులు చేసుకున్నారు. శ్రీనివాస్‌రెడ్డి, శ్రావణ్, కార్తీక కొన్ని నెలలుగా తమకే టికెట్ వస్తుందంటూ ఎవరికి వారు తమ అనుచరులతో గ్రామాల్లో పర్యటిస్తూ ధీమాగా ఉన్నారు. పోటాపోటీగా కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో క్యాడర్‌లో అయోమయం నెలకొంది. ముగ్గురిలో ఎవరికి టికెట్ వచ్చినా మిగతా ఇద్దరు సహకరిస్తారా అన్నది పెద్ద ప్రశ్నగా మిగిలింది.

చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ప్రచారం

పరిస్థితి అలా ఉంటే చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి 106 రోజులుగా నియోజకవర్గంలో ఆత్మగౌరవ యాత్ర చేపడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పర్యటిస్తున్నారు. ఇటీవల నాలుగైదు రోజుల నుంచి ఏకంగా ప్రచారం మొదలుపెట్టారు. చేతి గుర్తుకు ఓటు వేయాలని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెబుతున్నారు. ఈ ప్రచారం చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనా దుబ్బాక కాంగ్రెస్ టికెట్ ముగ్గురిలో ఎవరిని వరిస్తుందో అన్నది రెండు మూడు రోజుల్లో తేలిపోనుంది.



జోగిపేటలో గ్యారంటీ పథకాలపై మహిళలకు వివరిస్తున్న దామోదర

దోపిడీ పాలనకు చరమగీతం

ప్రజలకు అందోల్ కాంగ్రెస్ అభ్యర్థి దామోదర పిలుపు

వట్‌పల్లి (అందోల్): పదేళ్ల బీఆర్‌ఎస్ దోపిడీ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని అందోల్ కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. బుధవారం జోగిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభంజనం కొనసాగుతోందని, వచ్చేది తమ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. తమ మేనిఫెస్టోను బీఆర్‌ఎస్ కాపీ కొట్టిందని విమర్శించారు. ప్రజలు తమ పార్టీ వైపు చూస్తున్నారని, ప్రజాదరణను చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. అసంతృప్తితో ఉన్న సీనియర్ నాయకులతో హైకమాండ్ మాట్లాడి సమయోచిత నిర్ణయం తీసుకుంటుందన్నారు. అనంతరం జోగిపేటకు చెందిన వడ్డెర కుల సంఘం సభ్యులు, పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట్‌కు చెందిన యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో అందోలు–జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్లు ఎస్.సురేందర్‌గౌడ్, రంగ సురేష్, ఆకుల చిట్టిబాబు, డాకూరి శివశంకర్, పి.రేఖ ప్రవీణ్, హరి కృష్ణాగౌడ్, మాజీ ఎంపీటీసీ డాకూరి వెంకటేశం, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ సత్యవ్రత్, మాజీ కౌన్సిలర్ గొల్ల శరత్‌బాబు, నాయకులు శ్రీనివాస్ గౌడ్, సడిగె రవి, ఉల్వాల రాజు, డాకూరి శ్రీనివాస్, ఉల్వాల సతీష్, సడిగె శ్రీనివాస్, కొశికె రాజశేఖర్, చిట్యాల మధు, ఖాజా, రాములు పాల్గొన్నారు.

రూ.1.37 లక్షల మద్యం స్వాధీనం



పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

హవేళిఘణాపూర్(మెదక్): కిరాణ దుకాణంపై దాడులు నిర్వహించి రూ.1.37 లక్షల విలువచేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని హవేళిఘణాపూర్ ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇల్టెం రాములు బూర్గుపల్లి గ్రామంలో కిరాణ దుకాణం కొనసాగిస్తూ మద్యం విక్రయిస్తున్నాడు. బుధవారం అందిన సమాచారం మేరకు దాడిచేసి మూడు బీరు కేట్లను, 22 రకాల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచినవారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మా మేనిఫెస్టోను కాపీ కొట్టారు

జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ ధ్వజం



మాట్లాడుతున్న ఎ.చంద్రశేఖర్

ఝరాసంగం(జహీరాబాద్): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల మేనిఫెస్టోను బీఆర్‌ఎస్ కాపీ కొట్టిందని జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ విమర్శించారు. వస్తున్నా.. మీకోసంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని చీల మామిడి, జీర్లపల్లి, జునేగావ్, ఇస్లాంపూర్, ఏడాకులపల్లి, చిలక్రపల్లి, గినియార్ పల్లి, ఈదులపల్లి, దేవరంపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ముఖ్యమంత్రి కేసీఆర్ బాగున్నట్లు ప్రత్యక్షంగా ఒప్పుకున్నట్లయిందని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో సొంత పార్టీ కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలు అందించారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం వర్తించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగులను అంధకారంలో నెట్టేసిన ఘనత కేసీఆర్కే దక్కిందన్నారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్ చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కాంగ్రెస్‌కు అధికారం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాగా, ఆయా గ్రామాల్లోని బీఆర్‌ఎస్ పార్టీ వార్డు మెంబర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉజ్వల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్, ఎంపీపీ దేవదాసు, వైస్ ఎంపీపీ మల్లన్న పాటిల్, ఎంపీటీసీలు శంకర్ పాటిల్, శకుంతల, సర్పంచ్ రాంరెడ్డి, విజయలక్ష్మి, యువజన కాంగ్రెస్ పార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



చిత్తా.. బొత్తా..?



- తేలని కాంగ్రెస్, సీపీఐ పొత్తు వ్యవహారం
- హుస్నాబాద్‌లో పొత్తులు.. సీట్లపై ఇరు పార్టీల మల్లగుల్లాలు

హుస్నాబాద్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంటేనే మొదటి నుంచి పొత్తుల సంసారం. ఇప్పటి వరకు పొత్తులు లేకుండా ఎన్నికలు జరగలేదు. ఇందుర్తి నియోజకవర్గం ఉన్న సమయంలో కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ మధ్య పోటీ తీవ్రంగా ఉండేది. కానీ ఓటర్లు మాత్రం విచిత్రంగా తీరిచ్చేవారు. అధికార పార్టీకి కాక ప్రతిపక్ష పార్టీ అభ్యర్థికి పట్టంకట్టేవారు. నియోజకవర్గంలో ఐదు సార్లు సీపీఐ గెలిచి కంచుకోటగా చేసుకుంది. నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా ఇందుర్తి నుంచి హుస్నాబాద్ నియోజకవర్గంగా ఆవిర్భవించడంతో 2009 నుంచి 2018 ఎన్నికల వరకు ఒక్కసారి కాంగ్రెస్, రెండు సార్లు బీఆర్‌ఎస్ విజయం సాధించాయి.

పొత్తు, సీట్ల కేటాయింపులో మల్లగుల్లాలు

ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, సీపీఐ పొత్తు విషయం, కేటాయింపులో రెండు పార్టీల నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ అయోమయ స్థితిలో అభ్యర్థులను ప్రకటించలేని దుస్థితి నెలకొంది. పొత్తులో భాగంగా హుస్నాబాద్ సీటును సీపీఐ నుంచి మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి టికెట్‌ను ఆశిస్తుండగా, కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి టికెట్ కోసం బరిలో ఉన్నారు. రెండు పార్టీల అధిష్టానాలు పొత్తులు, సీట్ల విషయంలో కసరత్తుతో కాలయాపన చేస్తుండటంతో ఆశావాహుల మధ్య గందరగోళం నెలకొంది. సీపీఐ అభ్యర్థి చాడ వెంకట్‌రెడ్డి కేవలం ప్రెస్‌మీట్‌లతోనే సరిపుచ్చుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

సీఎం సభతో గులాబీ శ్రేణుల్లో జోష్

మరో వైపు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పేరును అధిష్టానం ప్రకటించింది. 15న హుస్నాబాద్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ సతీష్‌కుమార్‌కు బీఫాం కూడా అందజేశారు. దాదాపు నెల రోజుల నుంచి సతీష్‌కుమార్ సుడిగాలి పర్యటనతో గ్రామాలను చుడుతూ ప్రచారంలో దూకుడు పెంచారు. ఆశీర్వాదసభ సక్సెస్ అవడంతో గులాబీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. తనకు పోటీగా ఎవరు వచ్చినా పర్వాలేదన్నట్లుగా ఆత్మీయసభలతో సతీష్‌కుమార్ ప్రచారం ఉధృతం చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో రెండు గ్రూపులు

కాంగ్రెస్ టికెట్‌ను ఆశిస్తున్న పొన్నం ప్రభాకర్, ప్రవీణ్‌రెడ్డి ఎవరికి వారు టికెట్ తమకే దక్కుతుందనే ధీమాతో పోటాపోటీగా ప్రచారం చేసుకుంటున్నారు. ప్రవీణ్ రెడ్డి ఇప్పటికే దాదాపు 90 గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని చెబుతూ ప్రచారం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాహుల్‌గాంధీ బహిరంగ సభకు ఎవరికి వారే వాహనాలను సమకూర్చి కార్యకర్తలను తరలించారు. గత నెల 18న కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాల ప్రచారంలో భాగంగా హుస్నాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరైన సీడబ్ల్యూసీ సభ్యుడు మోహన్ ప్రకాష్‌ను స్వాగతించే క్రమంలో పొన్నం, అలిగిరెడ్డి వర్గీయులు బాహాబాహీకి దిగారు. అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఇద్దరు వేర్వేరుగా పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేసుకున్నారు. పొన్నం ప్రభాకర్ కొద్ది రోజుల నుంచి హుస్నాబాద్‌లోనే మకాం వేసి అవకాశం వచ్చినప్పుడల్లా ప్రెస్‌మీట్లు పెట్టి బీఆర్‌ఎస్, బీజేపీలపై విరుచుకుపడుతున్నారు. పొన్నం మార్నింగ్ వాక్ పేరిట హుస్నాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటిస్తూ గ్యారంటీ కార్డులను ఇస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. మరోవైపు ప్రవీణ్ రెడ్డి సైతం గ్రామాల్లో పర్యటిస్తూ తనదైన శైలిలో ఓటర్లను ఆకట్టుకునే పనిపడ్డారు. పొత్తులో భాగంగా హుస్నాబాద్ సీటు కాంగ్రెస్‌కు వస్తుందా లేదా సీపీఐకి పోతుందా అనే ఉత్కంఠ కొనసాగుతోంది. ఒకవేళ కాంగ్రెస్‌కే వస్తే హుస్నాబాద్ టికెట్ పొన్నం ప్రభాకర్‌కా?, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికా? అనేది సస్పెన్స్‌గా మారింది.

శేష వాహనంపై విహరించిన పద్మనాభుడు



శేష వాహనంపై విహరిస్తున్న స్వామివారు



హంస వాహనంపై విహరిస్తున్న వేంకటేశ్వరస్వామి

అనంతగిరి: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలంపల్లి అనంత పద్మనాభస్వామి బుధవారం రాత్రి శేష వాహనంపై విహరించారు. ఆలయ మడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

హంస వాహన సేవలో శ్రీవారు

వికారాబాద్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి స్వామివారు హంస వాహనంపై విహరించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 11 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య



నర్సింలు (ఫైల్)

కొండపాక(గజ్వేల్): కుటుంబ కలహాలతో ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కుకునూరుపల్లి మండలం లోని లకుడారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొడిగ నర్సింలు (40) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. 13 ఏళ్ల కిందట కుటుంబ కలహాలతో ఆయన భార్య ఆత్మ హత్య చేసుకుంది. దీంతో 8 ఏళ్ళ కిందట రెండో వివాహం చేసుకున్నాడు. ఇటీవల రెండో భార్యతో గొడవలు జరుగుతుండడం, వ్యవసాయం కోసం చేసిన అప్పుల కోసం మధనపడుతుండేవాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ప్రాణం తీసిన ఎక్కిళ్లు



సాయిలు (ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): ఎక్కిళ్లు ఓ ట్రాక్టర్ డ్రైవర్‌ను బలితీసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం ఖానాపూర్(కె)లో చోటుచేసుకుంది. గ్రామనికి చెందిన నర్వ సాయిలు(39) పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి భోజనం చేశాక అకస్మాత్తుగా ఎక్కిళ్లు మొదలయ్యాయి. తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ఈలోగా సాయిలు మృతిచెందాడు. ఎక్కిళ్లు రావడంతో గుండెపోటుకు గురైనట్టు 108 సిబ్బంది తెలిపారు. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

మనూరులో చిరుత కలకలం

మనూరు(నారాయణఖేడ్): మనూరు మండల పరిధిలోని దుదగొండ, బోరంచ అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తుందని స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా రేగోడ్ మండలం పోచారం, నారాయణఖేడ్ మండలం రుద్రారం, మనూరు మండలం దుదగొండ, బోరంచ గ్రామ శివారులోను చిరుత సంచరిస్తుందని స్థానికులు చెప్పారు. దుదగొండ శివారులో చిరుత సంచరించడం చూసి భయంతో పారిపోయామని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. నారాయణఖేడ్ ఫారెస్టు రేంజ్ అధికారి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా చిరుత సంచారం విషయం తమ దృష్టికి వచ్చిందని, సిబ్బందిని అలెర్ట్ చేసి ఆయా గ్రామాల సర్పంచ్‌లను అప్రమత్తం చేశామని చెప్పారు. గొర్రెలు, మేకల పెంపకందారులు అప్రమతంగా ఉండాలని సూచించారు.

చిరుత సంచారం

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం శివారులో బుధవారం అల్లాదుర్గం రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలోని గుట్టపై చిరుత పులిని చూసినట్లు స్థానికులు తెలిపారు. అల్లాదుర్గం, కాయిదంపల్లి, రెడ్డిపల్లి, వెంకట్‌రావుపేట, అప్పాజీపల్లి గ్రామాలు అటవీ ప్రాంతంలో ఉండడంతో పులి సంచరిస్తుందని సాయంత్రం పొలాలకు వెళ్లాలంటే రైతులు, పశువుల కాపరులు భయాందోళనకు గురవు తున్నారు. అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టి, పులి సంచారంపై ప్రకటన చేయాలని కోరారు. గతంలో కాయిదంపల్లి శివారులో పులి దూడను చంపి తిన్న విషయం తెలిసిందే.



గోల్కొండ ఫోర్ట్ వద్ద కేడెట్లు

కేడెట్‌ల క్షేత్ర పరిశోధన

గజ్వేల్‌రూరల్: స్థానిక బాలుర ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలో జరుగుతున్న స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌లో భాగంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కేడెట్లు క్షేత్ర పర్యటనలో పాల్గొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని గోల్కొండ కోట, ఆర్టిలరీని సందర్శించారని క్యాంపు శిక్షణాధికారి లెఫ్టినెంట్ కల్నల్ పినాకి తెలిపారు. అలాగే వారికి ఫైరింగ్ శిక్షణ ఇచ్చినట్టు క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ మధుసూదన్‌రావు తెలిపారు. సెమీ ఫైనల్ వాలీబాల్ పోటీలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ జట్లు గెలుపొంది ఫైనల్ మ్యాచ్‌కు ఎంపికైనట్టు క్రీడాధికారి లెఫ్టినెంట్ కల్నల్ రాకేష్ జైస్వాల్ చెప్పారు. 17 డైరెక్టరేట్‌లకు చెందిన కేడెట్లకు గ్రూప్‌సాంగ్ పోటీలను నిర్వహించామని క్యాంప్ కమాండెంట్ కల్నల్ సునీల్ అబ్రహం తెలిపారు.

బహుజన బతుకమ్మ కావాలి

- ప్రజాయుద్ధభేరి అధ్యక్షురాలు విమలక్క
- రేగడిమైలారంలో బతుకమ్మ సంబరాలు

కొండాపూర్‌పేట: బహుజన బతుకుల్లో పండుగ సంతోషాలు నిండాలని ప్రజా యుద్ధభేరి అధ్యక్షురాలు విమలక్క ఆకాంక్షించారు. బుధవారం మండలంలోని రేగడిమైలారంలో నిర్వహించిన బహుజన బతుకమ్మ సంబరాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బతుకమ్మను ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ పూల కవాతుగా.. స్త్రీల కవాతుగా ఊరూరా బహుజన బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆడపడుచుల ఆనందాల పండుగ బతుకమ్మను ఉన్నత వర్గాలకే పరిమితం కాకుండా బహుజనుల బతుకమ్మ కావాలని అన్నారు. పూల పండుగ దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం, ప్రకృతి ఆధారంగా పూల పండుగను నిర్వహించి పర్యావరణాన్ని, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే సందేశంతో, సామాజిక న్యాయం కోరుతూ బహుజన బతుకమ్మ సంబరాలు చేస్తున్నట్లు తెలిపారు. మద్యం మత్తును చిత్తు చేస్తూ స్త్రీలపై అఘాయిత్యాలను ఎదిరిస్తూ బహుజన బతుకమ్మ సంబరాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు కూలి సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, మహిళా సంఘం నాయకురాలు రాజేశ్వరి, ఆర్‌పీఓడబ్ల్యూ పద్మ, దళిత ప్రజాసంఘాల నాయకులు చంద్రయ్య, శ్రీనివాస్, రమేశ్‌బాబు, అరుణోదయ మల్సూర్, అనితాకుమారి, చెవిటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.